# 'టిబి ముక్త్ హైదరాబాద్' లక్ష్యం : డిఎంహెచ్‌వో డా.పుట్ల శ్రీనివాస్

**హైదరాబాద్, జూలై 17,ప్రభాతవార్త:**
టిబి ముక్త్ హైదరాబాదే తమ లక్ష్యమని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు శుక్రవారం జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం రాష్ట్ర క్షయవ్యాధి అధికారి డా. ఎ. రాజేశం అధ్యక్ష తన డిఎంహెచ్‌వో డా. పుట్ల శ్రీనివాస్ గారి సమక్షంలో నిర్వహించారు. ఈసమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్లు, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్లు ,సీనియర్ టీబీ ల్యాబొరేటరీ సూపర్‌వైజర్లు, జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమానికి చెందిన ఇతర సిబ్బంది పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా రాష్ట్ర క్షయవ్యాధి అధికారి జిల్లాలో కార్యక్రమం అమలు తీరును సమీక్షించి, టీబీ అనుమానితుల గుర్తింపును మరింత పెంపొందించడం, నమోదు చేయబడిన ప్రతి టీబీ రోగికి 100 శాతం సంరక్షణ అందించడం, అర్హులైన కుటుంబ సభ్యులందరికీ టీబీ ప్రివెంటివ్ థెరపీ ప్రారంభించడం, "టీబీ ముక్త్ భారత్" స్క్రీనింగ్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడం, రోగులకు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లావైద్యఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్

పోషకాహారకంగా ఫుడ్ బాస్కెట్లను అందించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు..ఈ కార్యక్రమంలో డా.శ్రీధర్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి,డా.సాయిబాబా ప్రోగ్రామ్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ వార్త



# ఎస్ ఐ ఆర్ ప్రక్రియ వేగవంతం



## - 33.56 శాతం డిజిటైజేషన్ పూర్తి - చంద్రాయణగుట్టలో అధికం.. ముషీరాబాద్‌లో అత్యల్పం

**జూబ్లీహిల్స్, జూలై 17, ప్రభాతవార్త:** రాష్ట్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం నగరంలో వేగంగా కొనసాగుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల వరకు నమోదైన గణాంకాల ప్రకారం మొత్తం 47,36,669 మంది ఓటర్లలో 15,89,830 ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటలైజ్ అయ్యాయి. ఇది మొత్తం ఓటర్లలో 33.56 శాతంగా ఉంది. శుక్రవారం రోజు రెండు గంటల్లోనే 24 వేలకుపైగా ఫారాలు మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల మధ్యలోనే 24,697 ఫారాలు డిజిటైజ్ కావడం విశేషం. ఈ ప్రక్రియలో మొత్తం 4,062 మంది బీఎల్‌వోలు తమ సేవలందిస్తున్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో వివిధ రాజకీయ పార్టీలు ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటుచేసి సేవలందిస్తున్నారు. మరోవైపు బీఎల్వోలతో కలిసి బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో పర్యటించి పత్రాలను సేకరిస్తున్నారు. అయితే పొడగించిన తేదిలను కలుపుకొంటే ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియకు మరో 16 రోజులు మిగిలి ఉండటంతో నమోదు ప్రక్రియ శాతాన్ని పెంచాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ బీఎల్వోలకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నారు. మరోవైపు బీఎల్వోలుగా సేవలందిస్తున్న వారికి ఎస్ఐఆర్ పూర్తి అయ్యేవరకు సెలవులను ఇవ్వడానికి ఉన్నతాధికారులు అంగీకరించడం లేదు. అధికారిక లెక్కల ప్రకారం పాతబస్తీ ప్రాంతంలో ఈ ప్రక్రియ కొంత ముందంజలో ఉండడం గమనార్హం.

**చాంద్రాయణగుట్ట అగ్రస్థానంలో..**

డిజిటైజేషన్ శాతంలో చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గం 41.06 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. తరువాతి స్థానాల్లో 37.04 శాతంతో నాంపల్లి, 36.60 శాతంతో కర్వాన్, 36.04 శాతంతో బహదూర్‌పురా, 35.52 శాతంతో సికింద్రాబాద్ నిలిచాయి. ఇదిలా ఉండగా ముషీరాబాద్‌లో అత్యల్ప పురోగతి డిజిటైజేషన్ కావడం గమనార్హం. ముషీరాబాద్ నియోజకవర్గం 29.04 శాతంతో చివరి స్థానంలో ఉంది. 29.25 శాతంతో అంబర్‌పేట్, 30.48 శాతంతో యాకుత్‌పుర, 30.67 శాతంతో మలక్‌పేట్ నియోజకవర్గాల్లోనూ కొంత వేగం తగ్గింది. ఇక జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 4,06,729 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకు 1,28,621 ఫారాలు డిజిటైజ్ అయ్యాయి. గత రెండు గంటల్లోనే 2,400 ఫారాలు నమోదు కావడం గమనార్హం. ఇక్కడ 407 మంది బీఎల్‌వోలు విధులు నిర్వహిస్తున్నారు.

**నాలుగు లక్షలకుపైగా పెండింగ్**

ఇప్పటికే నగరంలో వివిధ మార్గాల్లో ప్రజలు సమర్పించిన, బీఎల్‌వోల ద్వారా ధృవీకరించాల్సిన ఫారాల సంఖ్య 4,09,275గా ఉందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటివరకు బీఎల్‌వోలు 33,467 ఫారాలను ధృవీకరించారు. 9,274 మంది ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలున్నట్లు అధికారుల గుర్తించారు. గోషామహల్‌లో అత్యధికంగా 1,019 మంది, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 938 మంది, యాకుత్‌పురాలో 776 మంది ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

**ముందుకొచ్చి సహకరించండి**

| నియోజకవర్గం | మొత్తం ఓటర్లు | డిజిటలైజేషన్ |
|---|---|---|
| చంద్రాయణగుట్ట | 377300 | 41.06 |
| ముషీరాబాద్ | 3,10,116 | 29.04 |
| మలక్‌పేట్ | 3,30,191 | 30.67 |
| అంబర్‌పేట్ | 2,82,314 | 29.25 |
| ఖైరతాబాద్ | 2,93,667 | 33.69 |
| జూబ్లీహిల్స్ | 4,06,729 | 31.62 |
| సనత్‌నగర్ | 2,54,030 | 31.52 |
| నాంపల్లి | 3,45,940 | 37.04 |
| కర్వాన్ | 3,83,190 | 36.60 |
| గోషామహల్ | 2,75,208 | 34.15 |
| చార్మినార్ | 2,37,483 | 32.65 |
| యాకుత్‌పురా | 3,74,948 | 30.48 |
| బహదూర్‌పురా | 3,51,023 | 36.04 |
| సికింద్రాబాద్ | 2,68,951 | 35.52 |
| కంటోన్మెంట్ | 2,45,579 | 31.44 |
| మొత్తం | 47,36,669 | 33.56 |

ఓటర్లు తమ వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. ఓటరు జాబితా ఖచ్చితత్వాన్ని పెంచేందుకు బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

## -జిల్లా రెవెన్యూ అధికారి నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌వో నారాయణ

**హైదరాబాద్,జూలై 17,ప్రభాతవార్త:**
యుపిఎస్‌సి,సిఏపిఎఫ్ (సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్) పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి డా. నారాయణ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం జరగనున్న సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ (అసిస్టెంట్ కమాండెంట్) పరీక్షా ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో పాల్గొని నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆదివారం 19న రెండు సెషన్లలో ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:00 వరకు, అలాగే మధ్యాహ్నం 2:00 నుండి 5:00 వరకు జరగనున్నది. ఈ పరీక్షకు హైదరాబాద్‌లో 17 సబ్ సెంటర్లు కేటాయించగా వీటిలో మొత్తం 6,917 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షా ఏర్పాట్లను సమీక్షిస్తూ ఎలాంటి లోపాలు లేకుండా, పరీక్షా ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కేంద్రాలలో శుభ్రత, అభ్యర్థుల ఫ్రిస్కింగ్, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీటి సదుపాయం, ఫస్ట్ ఎయిడ్ కిట్ల అందుబాటు, పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర ట్రాఫిక్ ప్రవాహం అలాగే పరీక్షా కేంద్రాల రూట్లలో స్పెషల్ ఆర్.టి.సి బస్సుల పై సంబంధిత అధికారులకు సూచించారు. కేంద్రాలలో మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లను వెన్యూ సూపర్వైసర్లు, లోకల్ ఇన్స్పెక్టింగ్ అధికారులు ఖచ్చితంగా నిర్ధారించుకోవాలని సూచించారు. ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియ సమగ్రంగా అమలు చేయాలని సూచించారు. పరీక్షా సమయానికి 30 నిమిషాల ముందు కేంద్రం గేట్లు మూసి వేయబడతాయని, అభ్యర్థులు సూచించిన సమయంలోపు కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. ఈ ఎడ్మిట్ కార్డు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని, మొబైల్ ఫోన్, డిజిటల్ గడియారాలు, ఇతర నిషేధిత వస్తువులతో కేంద్రంలోని అనుమతి ఉండదని తెలిపారు. ఈ సమావేశంలో డిసిపి రమణారెడ్డి, అదనపు డీసీపీ భాస్కర్, ఏసీపీ లక్ష్మణ్ , లోకల్ ఇన్స్పెక్టింగ్ అధికారులు, వెన్యూ సూపర్వైసర్లు, రూట్ ఆఫీసర్లు, సెక్షన్ సిబ్బంది, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భవనంపై నుండి దూకి రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

**గన్‌ఫౌండ్రి, జూలై 17ప్రభాతవార్త:**
జీవితంపై విరక్తి చెందిన ఓ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి బహుళ అంతస్తుల భవనంపై నుంచి కింద దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మయూర్ కాంప్లెక్స్ చోటు చేసుకుంది. అబిడ్స్ పోలీసుల కథనం ప్రకారం.. పాతబస్తీడబీర్‌పురా ప్రాంతానికి చెందిన బాబురావు(65) వాణిజ్య పన్నులశాలో ప్రభుత్వ ఉద్యోగిగా విధులనునిర్వహిస్తు రిటైర్ట్‌మెంట్ అయ్యారు. గత కొద్ది రోజులుగా మానసికంగా కుంగిపోయారు. దీంతో జీవితంపైవిరక్తి చెంది అబిడ్స్‌లోని మయూర్ కాంప్లెక్స్ బహుఅంతస్తుపై ఎక్కి కింద దూకి ఆత్మహత్యకు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహానికి శవ పంచనామా జరిపి పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మార్చురీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబ సమస్యలే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసు అబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్ అదుపుతప్పి ఇద్దరు స్నేహితుల దుర్మరణం

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 17, ప్రభాతవార్త :**
ఇద్దరు స్నేహితులు బైక్ పై వెళ్తుండగా అదుపు తప్పడంతో పిల్లర్ని ఢీకొని మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.



మహ్మద్ యునెస్ , అఖిలేష్ యాదవ్

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లాకు చెందిన అఖిలేష్ యాదవ్ (24) కెపిహెచ్‌బి కాలనీలోని ఓ హాస్పిటల్‌లో ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తూ హాస్టల్లో నివాసం ఉంటున్నాడు. గురువా రం అర్ధరాత్రి దాటిన తర్వాత స్నేహితుడైన మహ్మద్ యునెస్ (26) ఇద్దరు కలిసి బైక్ పై జేఎన్టీయూ నుండి కూకట్‌పల్లి వైపుకు వెళుతుండగా కూకట్‌పల్లి భాగ్య నగర్ బస్ స్టాప్ దగ్గర బైకు అదు పుతప్పి పిల్లర్ నెంబర్ 746 నుండి కొట్టడంతో కిందపడి వారి ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అందులో అఖిలేష్ యాదవ్ అక్క డికక్కడే చనిపోగా వెనకాల కూర్చున్న యునుస్ అంబులెన్స్ ద్వా రా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షి ంచి చనిపోయాడని తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థిని ఆత్మహత్య

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 17, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 9వ తరగతి చదువుతున్న ఓ 14 ఏళ్ల విద్యార్థిని ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మూసాపేట్‌లోని ఎస్ఎం మోడల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని గురువారం తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటన సమయంలో ఆమె పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు నరేష్‌తో వీడియో కాల్లో ఉన్నట్లు ప్రాథమిక సమాచారం వెల్లడైంది. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా, విద్యార్థిని కొంతకాలంగా ఉపాధ్యాయుడితో వాట్సాప్‌లో చాటింగ్ చేసినట్లు, గురువారం ఇన్స్టాగ్రామ్‌లో కొత్త ఖాతా తెరిచి అక్కడ కూడా సందేశాలు పంపినట్లు పోలీసులు గుర్తించారు. వీడియో కాల్ సందర్భంగా విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా ఉపాధ్యాయుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. వారు ఇంట్లోకి వెళ్లి చూడగా విద్యార్థిని ఉరివేసుకుని కనిపించినట్లు సమాచారం. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. విద్యార్థిని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పరిశీలించగా ఉపాధ్యాయుడితో చాటింగ్ ఉన్నట్లు గుర్తించారు. అయితే వాట్సాప్ చాటింగ్‌కు సెక్యూరిటీ పాస్వర్డ్ ఉండటంతో డిజిటల్ ఆధారాలను విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఉపాధ్యాయుడితో ఉన్న సంబంధమే తమ కుమార్తె ఆత్మహత్యకు కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఉపాధ్యాయుడు నరేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విద్యార్థిని ఆత్మహత్యకు దారితీసిన అసలు కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

# భూ నిర్వాసితులకు చెక్కుల పంపిణీ

**హైదరాబాద్, జూలై 17, ప్రభాతవార్త:**
రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్ సంబంధించిన భూనిర్వాసితులకు చెక్కులను అందచేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ నందు భూనిర్వాసితులకు నష్టపరిహారం చెక్కుల పంపిణీలో భాగంగా సుమారు నలభై రెండున్నర కోట్ల రూపాయలు అందించటం జరిగింది. భూనిర్వాసితులు చెక్కులు పొంది సంతోషం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎల్.ఏ.ఓ ఎస్ హెచ్01 అపర్ణ, కార్యాలయ సిబ్బంది, భూనిర్వాసితులు పాల్గొన్నారు.



నిర్వాసితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

# హాస్టళ్లు, పిజిల్లో మహిళల భద్రతకు భరోసా!

## -సిపి సజ్జనార్, జీహెచ్ఎంపి కమిషనర్ కర్ణన్



సమావేశంలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సీపీ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితరులు

**హైదరాబాద్ జులై 17 ప్రభాతవార్త :**
ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం నగరానికి వచ్చే మహిళలు, విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ హైదరాబాద్ సిటీ పోలీస్ కీలక అడుగు వేసింది. వారికి మరింత సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే ధ్యేయంగా హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థలతో కలిసి సంయుక్తంగా 'ప్రాజెక్ట్ సేఫ్ స్టే' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మొదటి దశ కింద రూపొందించిన సురక్ష నివాస్ 1.0 మార్గదర్శకాల బ్రోచర్‌ను శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ సంయుక్తంగా ఆవిష్కరించారు. అనంతరం కమిషనరేట్ పరిధిలోని హాస్టళ్లు, పీజీల నిర్వహణ, మహిళా భద్రతపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వారు పాల్గొని నిర్వాహకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ నగర పరిధిలోని ప్రతి మహిళా హాస్టల్, పీజీ నిర్వాహకులు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో తప్పనిసరిగా పేరు నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. మహిళల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు నూతనంగా అమల్లోకి తెచ్చిన రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ కింద నిర్దేశిత ఫామ్‌ఏను పూర్తి చేసి స్థానిక పోలీసులకు సమర్పించాలన్నారు. వసతి గృహాల్లో భద్రతా ప్రమాణాలపై తాము నిర్వహించిన సర్వేలో కొన్ని లోపాలు వెలుగు చూశాయని తెలిపారు. మొత్తం 10 ప్రత్యేక బృందాలతో నగర పరిధిలోని 447 మహిళా హాస్టళ్లలో క్షేత్రస్థాయి పరిశీలన జరపగా దాదాపు 97.5 శాతం హాస్టళ్లలో సీసీటీవీ కెమెరాలు ఉన్నప్పటికీ, కేవలం 43 శాతం వసతి గృహాలకు మాత్రమే సరైన కాంపౌండ్ వాల్స్ ఉన్నట్లు తేలిందన్నారు. అలాగే అత్యంత కీలకమైన అగ్నిమాపక పరికరాలు కేవలం 38.9 శాతం హాస్టళ్లలోనే అందుబాటులో ఉన్నాయని అన్నారు. త్వరలోనే హాస్టళ్లలో మహిళా భద్రతకై ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ హాస్టళ్ల నిర్వాహకులు చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ నివాసితులకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ టి. వెంకన్న మాట్లాడుతూ హాస్టళ్ల భవనం ఎన్ని అంతస్తులు ఉన్నప్పటికీ అత్యవసర సమయాల్లో నివాసితులు సురక్షితంగా బయటపడటానికి కచ్చితంగా రెండవ మెట్ల మార్గం, రెండు కేజీల సామర్థ్యం గల చిన్నపాటి ఫైర్ ఎక్స్‌టింగిషర్లను, భవనం పైభాగంలో ఉండే వాటర్ ట్యాంక్‌కు చిన్న మోటారును అనుసంధానించి హోస్ రీల్ సిస్టమ్ ఏర్పాటు చేసుకుంటే ప్రమాదం జరిగిన ప్రాథమిక దశలోనే మంటలను అదుపు చేయవచ్చన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ పి. మూర్తి, హెచ్‌సీఎస్సీ సెక్రటరీ జనరల్ శేఖర్ రెడ్డి, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ పి.ఉదయ్ కుమార్, అదనపు సీపీ(క్రైమ్స్) శ్రీనివాసులు, అదనపు సీపీ(లా అండ్ ఆర్డర్‌సౌత్ రేంజ్) తఫ్సీర్ ఇక్బాల్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ మూర్తి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ వెంకన్న, డీసీపీలు హెచ్‌సీఎస్సీ సెక్రటరీ జనరల్ శేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఖ్యాతి నరవణే, డీసీపీలు రక్షిత కృష్ణమూర్తి, శిల్పవల్లి, చైతన్యకుమార్, రమణారెడ్డి, డాక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# 'చేయూత'పై కోటి ఆశలు..

**-ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూపు**
**-రూ.4వేల పెన్షన్ ఎప్పుడిస్తారోనన్న చర్చ**
**-గ్రేటర్‌లో 6.33లక్షల మంది లబ్దిదారులు**
**-ఆగస్టు 15నుంచి వితంతు,ఒంటరి మహిళలకు పెన్షన్**
**-పెండింగ్, కొత్త దరఖాస్తుదారుల్లో చిగురిస్తున్న ఆశలు**



**హైదరాబాద్,జూలై 17,ప్రభాతవార్త:**
మూడేళ్ల క్రితం కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలపై దృష్టిసారించి ఇప్పటికే కొన్నింటికి శ్రీకారం చుట్టింది. రేషన్ కార్డులు, గృహ జ్యోతి వంటి పథకాలను అమలు చేసింది. ఈనేపథ్యంలో మరోగ్యారెంటీ "చేయూత"పై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గ్యారంటీ అమలైతే ..పేద కుటుంబాల బృద్ధులు, వితంతులు, దివ్యాంగులు, చేనేత,కల్లుగీత ,ఒంటరి మహిళల తదితర సామాజిక పెన్షనర్ల 4వేలకు పెరగనుంది. ఈనేపథ్యంలో ఆయా వర్గాలవారు ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా మంత్రి సీతక్క ఒంటరి మహిళలు, వితంతులకు కొత్త పెన్షన్ అమలు చేసానతమని చెప్పడంతో మిగతా వారిలోనూ ఆశలు చిగురిస్తున్నాయి. ప్రస్తుతం నెలవారీగా రూ.2016 పెన్షన్ అందుతుండటంగా..ఈమొత్తం రూ.4వేలకు చేరనుంది. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో మొత్తం మీద 6,33,209 మంది పెన్షన్ దారులు ఉన్నారు. వీరిలో దివ్యాంగులు 81,114 మంది ఉండగా..మిగిలిన వృద్ధాప్య ,వితంతు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత ,బిడి వర్కర్స్, హెచ్ఐవీ ఫైలేరియా తదితర పెన్షన్‌దారులు 5,52,095 మందికి పైగా ఉన్నారు. మరోవైపు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు మరో రెండులక్షల మంది వరకు ఉండవచ్చని అంచనా. దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ జరిగి సెర్ఫ్‌నకు ప్రతిపాదనలు వెళ్ళినా మంజూరు మాత్రం పెండింగ్‌లోనే ఉండిపోయింది. దరఖాస్తు చేసుకోని వారు మరోలక్ష మంది వరకు ఉన్నట్లు తెలుస్తుంది.

**తప్పని ఎదురుచూపులు..**

నాలుగైదు ఏళ్లుగా కొత్త పెన్షన్ల మంజూరు ఊసే లేకుండా పోయింది. గత ప్రభుత్వంలో వయస్సు సడలింపు 57 ఏళ్లకు పైబడి వారి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ..అందులో 40శాతం మాత్రమే మంజూరు లభించగా మిగతా తిరస్కరణకు గురయ్యారు. 65ఏళ్లు దాటిన వృద్ధాప్య, వివంతు, వికలాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత, బీడీ తదితర ఫించన్ల కోసం ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నటికీ ఆమోద ముద్ర పడకపోవడం గమనార్హం. అలాగే వృద్ధాప్య పించన్‌దారు మృతి చెందితే అతని భార్య ఫించన్ మంజూరు ప్రక్రియ కూడా పెండింగ్‌లోనే మగ్గుతోంది. మరణ ధ్రువీకరణ పత్రం తీసుకుని దరఖాస్తుదారులు కలెక్టరేట్, తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న ఫలితం లేకుండా పోతుంది. అధికారులు సైతం ఫించన్లు ఎప్పుడు మంజూరవుతాయో స్పష్టత ఇవ్వకపోవడంతో పేద కుటుంబాలకు ఆర్థిక కష్టాలు తప్పడం లేదు. ఈప్రభుత్వంలో అయినా తమ సమస్య పరిష్కారామవుతుందని కోటి ఆశలతో వారు ఎదురుచూస్తున్నారు.

# వ్యర్థాలను విలువైన వనరులుగా మార్చేదిశగా ముందుకు..

## - సిఎంసి కమిషనర్ సృజన

**దుండిగల్, జులై 17 ప్రభాతవార్త :** వ్యర్థాలను విలువైన వనరులుగా మార్చేందుకు అత్యాధునిక పద్ధతులపై అధ్యయనం చేస్తున్నట్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ డా.సృజన పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం జీడిమెట్లలోని కన్స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్(సిఅండ్‌డి) వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్, దుండిగల్ పరిధిలోని ఇటిగ్రేటెడ్ వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్‌లను కమీషనర్ సందర్శించారు. ముందుగా సిఅండ్‌డిలో నిర్మాణ వ్యర్థాల సేకరణ, వర్గీకరణ, రీసైక్లింగ్, పునర్వినియోగా నిర్మాణ ఉత్పత్తుల తయారీ విధానాలను పరిశీలించిన కమీషనర్ అక్కడి నుండి దుండిగల్‌లోని ఇంటిగ్రేటేడ్ వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్‌కు చేరుకున్నారు. యూనిట్‌లోని వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్, హాజర్డస్ వ్యర్థాల నిర్వాహన కేంద్రం, ఈ-వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్లను సందర్శించి ఆధునిక వ్యర్థాల నిర్వాహణ, సాంకేతికలు, కాలుష్య నియంత్రణ చర్యలు, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయా యూనిట్లలో రోజువారి ప్రాసెసింగ్ సామర్థ్యం, నిర్వాహణ విధానం, మౌళికసదుపాయాలు, ఆధునిక సాంకేతిక అమలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ వ్యర్థాల నిర్వాహణపై అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అధ్యాయనం చేస్తున్నట్లు తెలిపారు. ఉత్తమైన విధానాలతో వ్యర్థాలను విలువైన వనరులగా మార్చలన్నా ఉద్దేశ్యంతో, అందుకుగాను వివిధ రకమైన అధ్యాయనాలు చేస్తున్నామని, సాంకేతికతో కూడిన పర్యావరణ రహిత వ్యర్థాల నిర్వాహన వ్యవస్థను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలు చేయడం తమ లక్ష్యమన్నారు. సందర్శనలో సంబంధిత విభాగాల అధికారులు, సాంకేతిక నిపుణులు, ఆయా ప్లాంట్ల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.



ఈ-వేస్ట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ డా.సృజన

## బ్రెయిలీ కిట్లతో చదువు సులువు



బ్రెయిలీ కిట్లతో ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

**చాంద్రాయణగుట్ట, జులై 17, ప్రభాతవార్త :**
అంధ విద్యార్థులు బ్రెయిలీ కిట్లతో చదువును మరింత మెరుగు పరుచుకోవాలని బహదూర్‌పురా మండల డిప్యూటీ ఐఒఎస్ పెద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. శుక్రవారం దారుల్‌షిఫా ప్రభుత్వ ప్రాథమిక బాలుర అంధుల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్‌రెడ్డితో కలిసి విద్యార్థులకు బ్రెయిలీ కట్లను పంపిణీ చేశారు. అనంతరం రెడ్డి మాట్లాడుతూ బ్రెయిలీ కిట్లలో బ్రెయిలీ పలకలు, మ్యాథ్‌మెటిక్స్ పరికరాలు, స్టిక్స్ ఉన్నట్లు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో రాణించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బ్రెయిలీ కిట్ల ద్వారా విద్యార్థులు సులభంగా అక్షరాలు, గణితం నేర్చుకోవచ్చాన్నారు. అనంతరం డిప్యూటీ ఈవో వెంకట్‌రెడ్డి పాఠశాల ఆవరణలో గల వసతి గృహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమ్జద్ ఖాన్, ఆర్.రవికాంత్, రవిందర్‌రెడ్డి, జానయ్య, విద్యార్థులు, పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

**దుండిగల్, జులై 17, ప్రభాతవార్త**
గుమ్మడిదల గ్రామానికి చెందిన ఎస్. సుధాకర్ రెడ్డికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును స్టేట్ ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బొంగునూరి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యవసర వైద్య చికిత్స సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం గొప్ప భరోసాగా నిలుస్తోందన్నారు. ఖరీదైన వైద్య చికిత్సలు అవసరమైన సమయంలో ఆర్థిక ఇబ్బందులతో చికిత్సకు దూరమవుతున్న వారికి ఈ పథకం ద్వారా ప్రభుత్వం చేయూతనందిస్తోందని చెప్పారు. సీఎం సహాయనిధి చెక్కు అందుకున్న ఎస్. సుధాకర్ రెడ్డి, తనకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బొంగునూరి కిషోర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీకేఆర్ బృందం సభ్యులు, నాయకులు, పాల్గొన్నారు.

### ఘనంగా విద్యార్థి క్రమశిక్షణ మండలి ప్రమాణ స్వీకారం..



**జీడిమెట్ల, జులై 17, ప్రభాతవార్త**
అపురూప కాలనీలోని టీవీఆర్ మోడల్ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థి క్రమశిక్షణ మండలి (ఇన్వెస్టిచర్ సెరిమనీ) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకత్వాన్ని ప్రోత్సహించేలా పాఠశాల క్యాబినెట్‌ను ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారం చేయించారు. "ధర్మాన్ని నువ్వు రక్షిస్తే నిన్ను ధర్మం రక్షిస్తుంది" అనే సందేశంతో ధర్మ, శాంతి, ప్రేమ, సత్య అనే నాలుగు హౌస్‌లకు హౌస్ కెప్టెన్లు, హౌస్ టీచర్లను నియమించారు. అలాగే 7, 8, 9వ తరగతుల విద్యార్థులు ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించిన ఎన్నికల ద్వారా హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్, సీసీఏ కెప్టెన్లు, స్పోర్ట్స్ కెప్టెన్లు, డిసిప్లిన్ కెప్టెన్లు, కల్చరల్ కెప్టెన్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ శ్యాంబాబు ఎన్నికైన విద్యార్థి నాయకులకు సాష్‌లు, బ్యాడ్జీలు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం విద్యార్థుల మార్చ్‌పాస్ట్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్యాంబాబు మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. జయరాజ్, హౌస్ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్నికైన స్కూల్ క్యాబినెట్ సభ్యులను, వారిని తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులను టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టీవీఆర్ కోటి రెడ్డి అభినందించి, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

### తెలంగాణ వారసత్వ సంపద బోనాలు : మధుసూదనాచారి



వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరిస్తున్న రాష్ట్ర శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి

**చిక్కడపల్లి జులై 17 ,ప్రభాతవార్త :** తెలంగాణ వారసత్వ సంపద బోనాలు వేడుక, తెలంగాణ లోని ప్రతి ఇళ్ల పండుగ వాతావరణం లో ఆషాఢ మాసం అంతా వుంటుందని రాష్ట్ర శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఉజ్వల నిర్వహణలో లస్కర్ బోనాలు జాతర సందర్భంగా నాట్య గురువు లు శ్రీ వర్ష, వేద, నెహ్రూ నాయక్ శిష్య బృందం పలు శాస్త్రీయ జానపద నృత్యాలు ప్రదర్శించారు బాల కళాకారుడు హృతిక్ ఎల్లమ్మ వైభోగం ను నర్తించి చూపరులను ఆకట్టుకున్నారు. సాయి పావని, గొల్ల కృష్ణ, ప్రకాష్ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ తెలంగాణ కు ప్రత్యేక సంప్రదాయాలు పిండి వంటలు వున్నది గతం లో అంతగా గుర్తింపు పొందనీ పిండి వంటలు నేడు ప్రతి గల్లీలో షాపు లు వెలిశాయి అని చెప్పారు పాత పాటలు వింటే అమృతం తాగిన అనుభూతి కలుగుతుంది అని చెప్పారు బోనాలు జాతర లో తమ పాత్ర నిర్వహిస్తున్న వారికి సత్కారం చేయటం సమాజానికి సన్మానం అని అభివర్ణించారు శివ స్వామి గీత ,సదా ఘటం బాలరాజు బోసం నేత్ర ,మురళీ కుమార్ లను బోనాలు ఐకాన్ అవార్డ్స్ తో సత్కరించారు వేదిక పై సంఖ్యా శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ అధ్యక్షత వహించగా శివ నరసింహన్ స్వామి వీర భోగ వసంత రాయలు గురుస్వామి ఈశ్వరయ్య బాల రాజు తదితరులు అతిధులుగా పాల్గొన్నారు సంస్థ అధ్యక్షులు లక్ష్మీ కార్యక్రమ నిర్వహణ చేశారు.

## వీధుల్లో జగన్నాథుని వైభవం...ప్రణమిల్లిన భక్తజనం



పోలీసుస్టేషన్ వద్ద జగన్నాథస్వామికి పూజలు చేస్తున్న ఏసీపీ సుధాకర్, ఇన్‌స్పెక్టర్ రవిందర్

**చాంద్రాయణగుట్ట, జులై 17, ప్రభాతవార్త :** జగాల నేలే జగన్నాథుని రథయాత్ర పాతబస్తీ చాంద్రాయణగుట్టలో గురువారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. జగన్నాథ స్వామి మందిర్ మఠ్ వద్ద వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన ఎత్తైన రథంపై బలభద్రుడు, సుభద్ర, జగన్నాథుడి విగ్రహాలను ప్రతిష్టంప చేశారు. కాశీపీఠాధిపతి శ్రీమత్ జగద్గురు రామానుజాచార్య స్వామి రుగ్వేదాచార్య జీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు సంజయ్ కుమార్ పాండే ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు రథానికి గల తాళ్ళను లాగుతూ జేజే ధ్వానాలు చేశారు. రథయాత్ర ఆలయం నుండి ప్రారంభమై పోలీసుస్టేషన్, గాంధీ విగ్రహం, బంగారు మైసమ్మ చౌరస్తా మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. పోలీసు స్టేషన్ వద్ద చాంద్రాయణగుట్ట ఏసీపీ ఎ.సుధాకర్, ఇంటలిజెన్స్ ఏసీపీ రుద్ర భాస్కర్, కొత్త ఇన్‌స్పెక్టర్ ఆర్.రవిందర్, డిఐ రామస్వామి, ఎస్సైలు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. రుగ్వేదాచార్యజీ వారిని శాలువ, పూల మాలతో సన్మానించారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ, ప్రత్యేకంగా తయ్యారు చేసిన మాల్‌పూరిని అందజేశారు. అంతకుముందు ఆలయంలో స్వామి వార్లకు విశేష పూజలు, హోమం, పూర్ణాహుతి, హారతి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దామోదర్‌దాస్ గోవింద్ కుమార్ లోహియా, గులాబ్‌రాయ్ కాంతిలాల్, చంగ్‌మల్ ప్రమోద్ కుమార్, జ్యోతీధర్‌సింగ్‌లతోపాటు స్థానికులు ప్రమోద్ కుమార్ కార్వాంకర్, ఎం.ప్రభాకర్‌రాజ్ ముదిరాజ్, దీపక్, రవి రాహుల్, కె.నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### ఫీజుల రియంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి : ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ధర్నాచేస్తున్న ఆర్.కృష్ణయ్య, నిఖిల్ పటేల్, నీల వెంకటేష్ తదితరులు

**హైదరాబాద్, జులై 17,ప్రభాతవార్త:**
రాష్ట్రంలో 14 లక్షల మంది కళాశాల విద్యార్థులకు సంబంధించిన రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, జీఓ. నెం.9ను రద్దు చేసి పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సంఘం కన్వీనర్లు నిఖిల్ పటేల్, నీల వెంకటేష్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి బడ్జెట్ కేటాయించకుండా ముఖ్యమంత్రి పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం కూడా ప్రభుత్వం ఓర్వలేకపోతోందని, విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని, ఫీజు రీయింబర్స్మెంట్ పథకంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి అన్ని రాజకీయ పార్టీలతో పాటు మేధావులు, బీసీ సంఘాల అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. డిగ్రీ, జూనియర్ కళాశాలలకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ చెల్లింపులు నిలిచిపోవడంతో కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకూరుకుపోయాయని చెప్పారు. పాత విధానాన్ని ఎవరూ వ్యతిరేకించలేదని, అందువల్ల నేరుగా కళాశాలలకు ఫీజులు చెల్లించే పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నీల వెంకటేష్, నిఖిల్ పటేల్, అనంతయ్య, రాజేందర్, కిరణ్ కుమార్, మోహన్ వంశీ, బాలయ్యతో పాటు పలువురు విద్యార్థిసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సైబరాబాద్‌లో 55 మంది సీఐలు బదిలీలు

**హైదరాబాద్, జులై 17 ప్రభాతవార్త**
సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీగా బదిలీలు చోటుచేసుకున్నాయి. పరిపాలనా కారణాలతో 55 మంది సీఐలను బదిలీ చేశారు. ఈ మేరకు సీపీ రమేశ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

**బదిలీల వివరాలు**

ఈ విధంగా ఉన్నాయి.. మాదాపూర్ ఎస్‌హెచ్‌వోగా కేవీ సుబ్బారావు, మాదాపూర్ డీఐగా పి.రమేష్, రాయదుర్గం ఎస్‌హెచ్‌వోగా టీ.భూపతి, కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌వోగా డి.స్వామి గౌడ్, కూకట్‌పల్లి డీఐగా జి.శేఖర్‌రెడ్డి, బాలానగర్ ఎస్‌హెచ్‌వోగా జి. ప్రశాంత్, మియాపూర్ ఎస్‌హెచ్‌వోగా ఎన్. జయరాం, మియాపూర్ డీఐగా డి.విజయ నాయక్, కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌వోగా జి.విజయ్ కుమార్, కేపీహెచ్‌బీ డీఐగా బి. భూపాల్, కొల్లూరు ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా వెంకట్ రెడ, అల్లాపూర్ ఎస్‌హెచ్‌వోగా ఎస్.నవీన్ కుమార్, గచ్చిబౌలి ఎస్‌హెచ్‌వోగా కె.సైదులు, నార్సింగి ఎస్‌హెచ్‌వోగా డి.విష్ణువర్ధన్ రెడ్డి, కొల్లూరు ఎస్‌హెచ్‌వోగా చి.సైది రెడ్డి, చందానగర్ ఎస్‌హెచ్‌వోగా ఏ.ఆర్.ఈ. శ్రీధర్, చందానగర్ డీఐగా వి. జానయ్య, ఆర్‌సీ పురం ఎస్‌హెచ్‌వోగా జి. లాలునాయక్, పటాన్‌చెరు ఎస్‌హెచ్‌వోగా ఎం.రవీందర్, పటాన్‌చెరు డీఐగా కె.రామిరెడ్డి, అమీన్‌పూర్ ఎస్‌హెచ్‌వోగా ఎం.ప్రవీణ్‌రెడ్డి, ఐడీఏ బొల్లారం ఎస్‌హెచ్‌వోగా వి.సుధీర్‌కుమార్, జగద్గిరిగుట్ట ఎస్‌హెచ్‌వోగా పి.నరేందర్, మేడ్చల్ ఎస్‌హెచ్‌వోగా బి.అంజిరెడ్డి, దుండిగల్ ఎస్‌హెచ్‌వోగా ఎం.బాల్ రెడ్డి, దుండిగల్- సూరారం డీఐగా జి.రమేష్ నాయుడు, జీడిమెట్ల ఎస్‌హెచ్‌వోగా కె.రవికుమార్, సూరారం ఎస్‌హెచ్‌వోగా కె.బాలరాజు, బాచుపల్లి ఎస్‌హెచ్‌వోగా పి.దళినాయుడు, మియాపూర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా బి.నర్సింహ సంజయ్‌రెడ్డి, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా బుర్రి రాజు, గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా టీ.నర్సింహరాజు, మాదాపూర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా ఎస్.రాజశేఖర్ రెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా కె.క్రాంతి కుమార్, ట్రాఫిక్ అడ్మిన్‌గా జి.సురేష్, పటాన్‌చెరు ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా ఆర్. శ్యాం సుందర్ రెడ్డి, డబ్ల్యూపీఎస్ ఐటీ కారిడార్ ఎస్‌హెచ్‌వోగా మొగిలిచెర్ల రవి, సీసీఎస్ కూకట్‌పల్లిగా పి. జగదీశ్వర్, సీసీఎస్ నార్సింగిగా జి.మురళి కుమార్40. సీసీఎస్ కుత్బుల్లాపూర్‌గా జి. సత్యనారాయణ, సీసీఎస్ ఆర్‌సీపురంగా సుంకర విజయ్, సీసీఆర్‌బీగా సి.సతీష్ కుమాం, ఎస్‌వోటీ నార్సింగిగా శివకుమార్, ఎస్‌వోటీ కూకట్‌పల్లిగా ఎన్. సంజయ్‌కుమార్, ఎస్‌వోటీ కుత్బుల్లాపూర్‌గా కె. నర్సింహ, ఎస్‌వోటీ ఆర్‌సీపురంగా పి.సతీష్, సైబర్ క్రైమ్స్‌కు ఎ.గంగాధర్, సైబర్ క్రైమ్స్‌కు పి.యాదిరెడ్డి, సైబర్ క్రైమ్స్‌కు ఎ.మన్మోహన్, ఈవోడబ్ల్యూకు ఎ.రమేష్‌బాబు, ఈవోడబ్ల్యూకు ఎం.లక్ష్మారెడ్డి, 4సీ అండ్ ఎస్‌ఎంసీకి కె.ఎస్.రవి, ఐటీ సెల్/పీఎస్‌ఐటీసీకి ఎస్. సుధీర్‌కృష్ణ, డబ్ల్యూ అండ్ సీఎస్‌డబ్ల్యూకు ఈ.వెంకట్‌రెడ్డి, సీటీసీకి జి.హరికృష్ణరెడ్డిలు బదిలీ అయ్యారు.

### లిడ్‌కాప్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి.. దళిత ప్రజాప్రతినిధులకు వినతిపత్రం



అధ్యక్షులు పల్లెల వీరస్వామి ఆధ్వర్యంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే సత్యనారాయణలకు వినతిపత్రాన్ని సమ్పరించిన దృశ్యం

**చిక్కడపల్లి జులై 17 ( ప్రభాతవార్త ) :** టీపీసీసీ ఎస్సీ విభాగం అధ్యక్షులు, మనకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన దళిత ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశంలో లిడ్‌కాప్ పునరుద్ధరణ, సంస్థ భూముల పరిరక్షణ, చైర్మన్, డైరెక్టర్ల నియామకం తదితర అంశాలపై వినతిపత్రం సమర్పించారు. చర్మకారుల సమాఖ్య తరపున అధ్యక్షులు పల్లెల వీరస్వామి ఆధ్వర్యంలో ఈ వినతిపత్రాన్ని లోకసభ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే డాక్టర్ కవంపల్లి సత్యనారాయణకు అందజేశారు. అలాగే మాజీ మంత్రి గడ్డం వినోద్, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, వేముల వీరేశం, లక్ష్మీకాంతారావు, రాగమయి తదితర ప్రజాప్రతినిధులకు కూడా సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా చర్మకారుల ప్రతినిధులు పల్లెల వీరాస్వామి మాట్లాడుతూ, గత పదేళ్లుగా తెలంగాణ చర్మకారుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులను పలుమార్లు కలిసినా ఆశించిన ఫలితం రాలేదని తెలిపారు. వెంటనే లిడ్‌కాప్ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి, చైర్మన్, డైరెక్టర్లను నియమించాలని కోరారు. అలాగే రాష్ట్రంలో వేలాది మంది చర్మకారుల జీవనోపాధిని మెరుగుపరిచేలా లెదర్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి, లిడ్‌కాప్ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకునేలా సహకరిస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో చర్మకారుల సమాఖ్య జేఏసీ చైర్మన్, మాదిగ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆరేపల్లి రాజేందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గజ్జెల స్వామి, లెదర్ ఆర్టిసన్స్ సొసైటీ కార్యదర్శి ఓం ప్రకాష్, వశపాక నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### జెన్‌కో డైరెక్టర్ కుమార్ రాజాను కలిసిన విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్లు



**హైదరాబాద్, జులై 17,ప్రభాతవార్త:**
జెన్‌కో అకౌంట్స్ వింగ్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇన్‌చార్జ్ ప్రమోషన్లకు ఇటీవల ఆమోదం లభించి ఉత్తర్వులు జారీ కావడంతో, అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి. అంజయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం జెన్‌కో డైరెక్టర్ (హెచ్ఆర్‌డీ) కుమార్ రాజాని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కుమార్ రాజాకి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించింది. ఈసందర్భంగా జనరల్ సెక్రటరీ అంజయ్య మాట్లాడుతూ అకౌంట్స్ వింగ్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇన్‌చార్జ్ ప్రమోషన్ల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుని, ఉత్తర్వులు జారీ అయ్యేలా సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈప్రమోషన్లు అకౌంట్స్ విభాగ అధికారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయని, ఉద్యోగుల మనోబలాన్ని పెంచాయని అన్నారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగుల సంక్షేమం, కెరీర్ అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యల పరిష్కారంలో ఇదే విధమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నాసర్ షరీఫ్, సి.హెచ్. అనూరాధ, సిద్ధు, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు : ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి



డ్రింకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న గాంధీనగర్ ట్రాఫిక్ పోలీసులు

**ముషీరాబాద్, జులై 17, ప్రభాతవార్త:** మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల మద్యం సేవించి పట్టుబడ్డ 24మందిని మనోరంజన్ కాంప్లెక్స్‌లోని జేఎంఎఫ్‌సీ కోర్టులో హాజరుపరిచారు. మొదటి సారి పట్టుబడిన 21మందికి 5,100 రూపాయల జరిమానా విధించిన కోర్టు, రెండవ సారి పట్టుబడిన ముగ్గురికి 5,300 రూపాయల జరిమానాతో పాటు మూడు రోజులు జైలు శిక్ష కూడా విధించినట్లు సీఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపటం ప్రమాదకరమని, వాహనదారులెవరూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సీఐ సూచించారు

## జలమండలి మల్కాజిగిరి రీజియన్‌లో వాననీటి సంరక్షణకు చర్యలు

**హైదరాబాద్, జులై 17 ప్రభాతవార్త**
భూగర్భ జలమట్టాలను పెంచేందుకు మల్కాజిగిరి రీజియన్ పరిధిలో జలమండలి ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఎండిపోయిన బోరుబావుల చుట్టూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి, సమీప భవనాల పైకప్పుల నుంచి వచ్చే వర్షపు నీటిని ఇంజెక్షన్ విధానంలో భూగర్భంలోకి మళ్లిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 181 బోరుబావులను గుర్తించగా, ఇప్పటివరకు 53 బోర్లను రీచార్జ్ నిర్మాణాలుగా మార్చారు. మరో 62 బోర్ల వద్ద పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన 66 బోర్ల వద్ద పనులు చేపట్టాల్సి ఉంది. ప్రతి సర్కిల్‌లో 50 ఇంకుడు గుంతల ఏర్పాటును లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు సుమారు 62 ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. హస్తినాపురం హనుమాన్‌నగర్, అగ్రికల్చర్ కాలనీ, సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ, ఉప్పల్ స్వరూప్‌నగర్, ఇంద్రప్రస్థ కాలనీల్లో నమూనా నిర్మాణాలు చెప్పినట్టు ఆపరేషన్ డైరెక్టర్ వాస సత్యనారాయణ తెలిపారు. వర్షపు నీటిని వృథా చేయకుండా ఇంకుడు గుంతలు, రీచార్జ్ పిట్లలోకి మళ్లించాలని ప్రజలకు జలమండలి విజ్ఞప్తి చేసింది.

**నీరు వృథా..జూబ్లీహిల్స్‌లో వినియోగదారుడికి రూ.5వేల ఫైన్...**
తాగునీటిని వృథా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జలమండలి హెచ్చరించింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 33లోని ఒక భవనం వద్ద తాగునీటితో ప్రాంగణాన్ని కడుగుతూ నీటిని వృథా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. జలమండలి ఓ అండ్ ఎం డివిజన్-6 అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత వినియోగదారుడికి రూ.5 వేల జరిమానా విధిస్తూ నోటీసు జారీ చేశారు. జరిమానా మొత్తాన్ని నోటీసు అందుకున్న ఏడు రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించారు. జలమండలి చట్టం-1989లోని సెక్షన్ 38, 39 ప్రకారం నీటిని పొదుపుగా వినియోగించాలని, నీటి దుర్వినియోగాన్ని గుర్తించేందుకు అధికారులు ప్రాంగణాలను తనిఖీ చేసే అధికారం కలిగి ఉంటారని స్పష్టం చేశారు. మరోసారి నీటిని వృథా చేస్తే సెక్షన్ 42 ప్రకారం తాగునీరు, మురుగునీటి కనెక్షన్లను నిలిపివేయడంతో పాటు తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాగునీటిని వాహనాలు, రహదారులు, ప్రాంగణాల శుభ్రతకు వినియోగించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పొదుపుగా వాడాలని జలమండలి ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

### ఎన్యుమరేషన్ ఫారాలను ఆన్‌లైన్ చేయడంలో వేగం పెంచండి : ఈఆర్ఓ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**అత్తాపూర్ జులై17,ప్రభాతవార్త :** ఓటరు నమోదు జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ), రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. శుక్రవారం సాయంత్రం అత్తాపూర్ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఏఈఆర్ ఓ మల్లారెడ్డి తో కలిసి సూపర్వైజర్లతో ఆయన సమావేశమైనారు. ఈ సందర్భంగా సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గం పరిధిలో 6,35,283 మంది ఓటర్లుండగా, మనం 6,35,281 మందికి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. సకాలంలో వారి ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి తీసుకుని ఆన్ లైన్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటి వరకు 2,39, 653 మంది ఓటర్లకు చెందిన ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి వారి నుంచి తీసుకుని ఆన్ లైన్ చేయడం జరిగిందన్నారు.



**అత్తాపూర్ సర్కిల్‌లో....** అత్తాపూర్ సర్కిల్ లోని 249 పోలింగ్ బూత్ లలో 2,93,744 మంది ఓటర్లుం డగా, ఇప్పటి వరకు 1,03,479 మంది ఓటర్లకు సంభందించిన ఓటరు ఎన్యుమరేషన్ ఫారాలను ఆన్ లైన్ చేయడం జరిగిందన్నారు. మిగతా 1, 90, 265 ఓటర్లకు సంబందించిన ఎన్యుమరేషన్ ఫారాలను కూడా సకాలంలో పూర్తి చేసి తీసుకుని ఆన్లైన్ చేయించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ప్రతి రోజు కష్టపడి పనిచేయాలన్నారు.

### హత్య కేసులో నిందితుడికి యావజ్జీవశిక్ష

**అత్తాపూర్ జులై17,ప్రభాతవార్త :** అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో సంచలనం సృష్టించిన హత్య కేసులో నిందితుడికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. రాజేంద్రనగర్‌లోని 10వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు నిందితుడు నిసార్ అహ్మద్‌ను దోషిగా తేల్చి జీవిత ఖైదుతో పాటు రూ.15 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. సిఐ సీతయ్య వివరాల నప్రకారం.. 2017 ఏప్రిల్ 24న మెహదీపట్నంలోని సాజిద్ రెసిడెన్సీలో అద్దె ఫ్లాట్‌లో తీవ్ర దుర్వాసన వస్తోందని సమాచారం అందడంతో ఫ్లాట్‌ను తెరిచి చూడగా, బెంగళూరుకు చెందిన నీసర్ అహ్మద్ మృతదేహం బాత్రూంలో కుళ్లిన స్థితిలో కనిపించింది. తలకు గాయాలు, మెడకు తాడు బిగించిన ఆనవాళ్లు గుర్తించిన పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వ్యాపార లావాదేవీల వివాదం కారణంగా నిసార్ అహ్మద్ హత్య చేసినట్లు దర్యాప్తులో తేలడంతో అతడిని అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం నిందితుడిని దోషిగా నిర్ధారించిన న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా విధించింది.

### డేటింగ్ యాప్.. విద్యార్థికి చేదు అనుభవం

**జూబ్లీహిల్స్, జులై 17, ప్రభాతవార్త:**
డేటింగ్ యాప్ ద్వారా పరిచయమైన యువతితో కలిసి పబ్‌కు వెళ్లిన ఓ విద్యార్థికి చేదు అనుభవం ఎదురైంది. పబ్ బిల్లు చెల్లింపుల పేరుతో డబ్బులు తీసుకుని, అనంతరం అతనిపై దాడికి పాల్పడటంతో జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. షేక్‌పేట్‌లోని ఓయూ కాలనీకి చెందిన బి. కళ్యాణ్ సింగ్(30) అనే విద్యార్థికి ఈ నెల 1న రాత్రి బంబుల్ యాప్ ద్వారా వర్షా రాజ్‌పుత్ అనే యువతి పరిచమైంది. జూబ్లీహిల్స్‌లోని కెమిస్ట్రీ బార్ అండ్ కిచెన్ వద్ద వీరు కలిశారు. ఇద్దరు కలిసి పబ్‌కు వెళ్లగా పబ్‌లో రూ.16,660 బిల్లు అయ్యింది. డబ్బులు ఇస్తే మళ్లీ ఇస్తానని నమ్మించిన ఆమె తిరిగి డబ్బులు ఇవ్వడానికి నిరాకరించింది. మాధాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలోని పిల్లర్ నంబర్ 1689 వద్ద వర్షా రాజ్‌పుత్ కొందరు గుర్తుతెలియని వ్యక్తులతో కలిసి కళ్యాణ్‌సింగ్‌తో గొడవకు దిగి దుర్భాషలాడి, దాడి చేసి, చొక్కా చింపివేశారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కోర్టు అనుమతితో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**బాల్య వివాహం.. భర్త, కుటుంబ సభ్యులపై కేసు నమోదు**
**జూబ్లీహిల్స్, జులై 17, ప్రభాతవార్త:** బాలికను వివాహం చేసుకొని వేధిస్తున్న భర్త, అత్తింటి కుటుంబ సభ్యులపై బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ఈ ఏడాది మే 13న రోడ్ నెం.10లోని షాహిన్ కన్వెన్షన్ హాల్‌లో 15 ఏళ్ల బాలికకు ఖైరతాబాద్‌కు చెందిన మారోజు రాజేష్ (28)తో వివాహమైంది. వివాహానంతరం బాలికపై భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులు శారీరక, మానసిక వేధింపులకు పాల్పడ్డారు. దీంతో భర్త, అతని కుటుంబ సభ్యులు, అలాగే బాల్య వివాహానికి సహకరించిన బాలిక తల్లిదండ్రులపై ఐసీడీఎస్ ఎక్స్‌టెన్షన్ అధికారి కిండకేరి రవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ఇన్‌స్టా పరిచయం.. పూణే నుంచి పిలిపించి మోసం**
**జూబ్లీహిల్స్, జులై 17, ప్రభాతవార్త:**
ఇన్‌స్టాలో పరిచయమైన ఒక యువతితో ప్రేమ, పెళ్లి పేరుతో సహజీవనం చేసి మోసగించిన డీజేపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన తిలక్ ప్రవీణ్ కుమార్ వర్ధన్ అనే వ్యక్తి, పూణేకు చెందిన యువతిని హైదరాబాద్‌కు రప్పించి గత ఏడాదిన్నర కాలంగా సహజీవనం చేస్తున్నాడు. ఆమెకు ఉద్యోగం ఇప్పిస్తానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా దగ్గరయ్యాడు. ఇటీవల కొండాపూర్‌లోని ఓ ఓయో గదిలో కూడా ఆమెతో శారీరక సంబంధాలు కొనసాగించాడు. అంతేకాకుండా ఆమె వద్ద నుంచి పలు దఫాలుగా రూ. 3లక్షలు తీసుకున్నాడు. ఏకాంతంగా ఉన్న సమయంలో తీసుకున్న ఫొటోలను, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెడుతానంటూ బెదిరింపులకు దిగాడు. ఇప్పుడు ముఖం చాటేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి మాదాపూర్ ఠాణాకు బదిలీ చేశారు.

**నేడు నిజాంపేట్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత**
**నిజాంపేట్, జులై 17, ప్రభాతవార్త :** విద్యుత్ వ్యవస్థ అభివృద్ధి పనుల (క్యాపిటల్ వర్క్స్) నిర్వహణ నేపథ్యంలో నేడు నిజాంపేట్ విద్యుత్ శాఖ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.00 గంటల వరకు 11 కేవీ కేఎన్ఆర్ ఫీడర్ పరిధిలోని కేఎన్ఆర్ కాలనీ, న్యూ శ్రీనివాస కాలనీ ప్రాం తాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. అలాగే ఉదయం 11.00 గంటల నుంచి 11.30 గంటల వరకు 11 కేవీ సాయినాథ్ ఫీడర్, న్యూ శ్రీనివాస కాలనీ ఫీడర్ పరిధిలోని భాను ఎస్టేట్, హైదర్ నగర్, మయూరి నగర్, సర్వే నంబర్191, ఎన్టీఆర్ నగర్, శ్రీనివాస కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. అభివృద్ధి పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి..

**కొంపల్లి, జులై 17, ప్రభాతవార్త**
బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె కుమార్తె స్వల్ప గాయాలతో బయటపడింది. తుర్కా చెరువు నుంచి నిర్మాణ వ్యర్థాలను తరలిస్తున్న టిప్పర్‌ను డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. బాచుపల్లి ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెంకు చెందిన జాన వెంకటలక్ష్మి (48), లక్ష్మీనారాయణ దంపతులు ఉపాధి కోసం కొంతకాలం క్రితం నగరానికి వచ్చి నిజాంపేట్ బండారీ లేఅవుట్‌లోని కనకదుర్గ భారతి నిలయం అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. వెంకటలక్ష్మి ఇళ్లలో పనిమనిషిగా పనిచేస్తుండగా, ఆమె భర్త లక్ష్మీనారాయణ టైలరింగ్ వృత్తితో జీవనం సాగిస్తూ నిజాంపేట్ జర్నలిస్టు కాలనీలో ఇటీవల బోటిక్ ఏర్పాటు చేసుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం వెంకటలక్ష్మి తన కుమార్తె దేవిప్రియతో కలిసి స్కూటీపై సాయినగర్ కమాన్ వైపు వెళ్తుండగా, తెలుగు యూనివర్శిటీ మహిళా వసతి గృహం సమీపంలో స్కూటీ ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో స్కూటీని రోడ్డు పక్కకు తీసుకెళ్లి మళ్లీ స్టార్ట్ చేసే ప్రయత్నం చేస్తుండగా, జీహెచ్ఎంసీకి చెందిన సీ అండ్ డీ వ్యర్థాలను తరలిస్తున్న టిప్పర్ (ఏపీ05 సీవీ 5877) వేగంగా దూసుకొచ్చి రోడ్డు పక్కన నిలిపిన స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటలక్ష్మి కిందపడగా, ఆమెపై నుంచి టిప్పర్ ముందు చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దేవిప్రియకు స్వల్ప గాయాలు కావడంతో పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

**బేగంపేట జులై 17,ప్రభాతవార్త :** బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ హైదరాబాద్ జిల్లా ఆరో అదనపు మెట్రో పాలిటన్ సెషన్స్‌జడ్జి తీర్పు నిచ్చారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 2015 మార్చి 20న బేగంపేట లోని న్యూఎంజీ హోటల్ లో టీ ఇవ్వడంలో ఆలస్యం జరిగిందనే కారణంతో హోటల్ సిబ్బంది ప్రేమ్ పై షోయబ్ (ఏ1), మహమ్మద్ షాబాజ్ ఖాన్ (ఏ2)లు దాడి చేసారు. హోటల్ నిర్వహకుడు మహమ్మద్ జహంగీర్ వారిని ప్రశ్నించడంతో అతన్ని కూడా బెదిరించి వెళ్లి పోయారు. అనంతరం అదే రోజు మధ్యాహ్నం 3గంటల సమయంలో హోటల్ కు తిరిగి వచ్చిన నిందితులు జహంగీర్‌ను బయటకు పిలిచి కత్తులతో దాడి చేసారు. తీవ్రంగా గాయపడిన జహంగీర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టారు. శాస్త్రీయ, మౌఖిక సాక్ష్యాలను సేకరించి ఛార్జి షీట్ దాఖలు చేసారు. ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం రెండవ నిందితుడు మహమ్మద్ షాబాజ్ ఖాన్ (32)ను దోషిగా తేల్చి జీవిత ఖైదుతో పాటు రూ 1000లు జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు నిచ్చింది. విచారణ కొనసాగుతున్న సమయంలోనే మొదటి నిందితుడు షోయబ్ మరణించాడు. ఈ కేసులో దర్యాప్తు అధికారి జి.బస్వారెడ్డి ప్రస్తుత బేగంపేట ఇన్స్‌పెక్టర్ పి. సైదులు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.ఉపేందర్ ,కోర్టు డ్యూటీ ఆఫీసర్ ప్రశాంత్, సమన్స్ ఆఫీసర్ శ్రీకాంత్, లైజన్ ఆఫీసర్ ఏఎస్సై మహేందర్, మానిటరింగ్ ఆఫీసర్ ఏఎస్సై నరసింహారెడ్డి, తదితరులు ఈ కేసులో కీలకంగా వ్యవహరించారు .నిందితుడికి శిక్ష పడేలా సమర్ధవంతంగా సాక్ష్యాధారాలను సమర్పించి బాధిత కుటుంబానికి న్యాయం చేసిన దర్యాప్తు, ప్రాసిక్యూషన్ బృందం, పోలీసు సిబ్బందిని మల్కాజ్ గిరి సీపీ సుమతి, డీసీపీ శ్రీధర్, ఏసీపీ గోపాల కృష్ణ మూర్తిలు అభినందించారు.

### రూ.2 కోట్ల విలువైన వజ్రాలతో ఉడాయింపు

**జూబ్లీహిల్స్, జులై 17, ప్రభాతవార్త:**
వజ్రాల వ్యాపారిని మోసం చేసి దాదాపు రూ. 2 కోట్ల విలువైన వజ్రాలతో ఉడాయించిన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మసాబ్‌ట్యాంక్ అహ్మద్‌నగర్‌కు చెందిన సయ్యద్ మొహమ్మద్ అహ్మద్(40) వజ్రాల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. నెల రోజుల క్రితం సూరత్ నుంచి రెండు క్యారెట్ల వజ్రాలను కొనుగోలు చేశాడు. అతని స్నేహితుడి ద్వారా వజ్రాలను విక్రయించేందుకు గోపాల్ రెడ్డి అనే వ్యక్తి మధ్యవర్తిగా పరిచమయ్యాడు. గోపాల్ రెడ్డి ద్వారా భాస్కర్ రెడ్డి, శివారెడ్డి పరిచమయ్యామరు. గురువారం సాయంత్రం సయ్యద్ మొహమ్మద్ అహ్మద్, శివారెడ్డితో కలిసి ఇంపీరియల్ అపార్ట్‌మెంట్‌లోని జీ 6 ఫ్లాట్‌కు వెళ్లి భాస్కర్ రెడ్డిని కలిశారు. వజ్రాల పరీక్ష కోసం భాస్కర్ రెడ్డి తనకు తెలిసిన రామ్ గోపాల్ అనే వ్యక్తికి ఇచ్చి పంపాడు. కొద్ది సమయం తరువాత రామ్ గోపాల్ నగదు తీసుకుని వస్తున్నాడని చెప్పినప్పటికి అతను తిరిగిరాలేదు. ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడంతో తాను మోసపోయినట్లు గ్రహించి సయ్యద్ మొహమ్మద్ అహ్మద్ ఇంపీరియల్ అపార్ట్‌మెంట్ కార్యాలయానికి వెళ్లగా అది తాళం వేసి కనిపించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి :చౌకి రవికుమార్



అజంపుర డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాహుల్ సింగ్ ను సన్మానిస్తున్న చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట, జూలై 17, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని కాంగ్రెస్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ పేర్కొన్నారు. అజంపుర డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన రాహుల్ సింగ్ ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిషన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కోటి పార్థివలింగార్చన మహోత్సవం



**నేరేడ్ మెట్ జూలై 17 ,ప్రభాతవార్త :** న్యూ బోయిన్‌పల్లిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో కోటి పార్థివలింగార్చన మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లక్ష్మీ సౌభాగ్యవతి ఇందిర, వారి స్నేహబృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని శివారాధన నిర్వహించారు.ముందుగా దీపారాధన, కలశస్థాపన, గణపతి పూజ, గౌరీ పూజ, నవగ్రహారాధన నిర్వహించారు. అనంతరం భక్తులు పుట్టమన్నుతో 108 పార్థివ శివలింగాలను రూపొందించి వాటికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, భస్మార్చన, పుష్పార్చన, బిల్వార్చన, ధూప, దీప, నైవేద్యాలతో విశేష పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా శివశ్రీ నిర్మల అంబికానాథ శర్మ మాట్లాడుతూ బాసర క్షేత్రంలోని ద్వాదశ జ్యోతిర్లింగాల దేవాలయ ఈశాన్య భాగంలో కోటి పార్థివలింగ స్తూపాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఈ నెల 19న పార్థివ శివలింగాలను స్తూపంలో ప్రతిష్ఠించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల మహిళా బృందాలకు ఉచితంగా పుట్టమన్ను అందజేసి, పార్థివ లింగాల తయారీతో పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం వాటిని కోటి పార్థివలింగ స్తూపంలో నిక్షిప్తం చేస్తామని వివరించారు.ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు అంజయ్య-ఇందిర దంపతులు మాట్లాడుతూ ప్రదోషకాలంలో పార్థివలింగార్చన నిర్వహించడం ఆధ్యాత్మిక సంతృప్తిని కలిగించిందన్నారు. ఈ నెల 19న బాసరలో జరిగే మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.అనంతరం ద్వాదశ జ్యోతిర్లింగ మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు శివశ్రీ నిర్మల అంబికానాథ శర్మను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు, స్థానిక భక్తులు, చందా మీనాక్షి, గడ్డం సిద్ధలక్ష్మి, ఈరంటి అనురాధ, వావిలాల ప్రభావతి, విజయ పాల్గొన్నారు.

## కార్తికేయనగర్‌లో రోడ్డు పనుల జాప్యంపై బిజెపి ఆగ్రహం

-కాలనీవాసుల ఇబ్బందులను పరిశీలించిన జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్ రావు



సమస్యను డిప్యూటీ కమీషనర్ నిత్యానంద్‌కు వివరిస్తున్న మల్లెల నర్సింగ్ రావు

**నాచారం, జులై 17 ప్రభాతవార్త :** నాచారం డివిజన్ పరిధిలోని కార్తికేయ నగర్‌లో రెండు నెలల క్రితం రోడ్డు నిర్మాణం పేరుతో తవ్వకాలు చేపట్టి, డ్రైనేజీ పైప్‌లైన్లు దెబ్బతిన్నప్పటికీ ఇప్పటి వరకు పనులు పూర్తి చేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగరావు ఆరోపించారు.కాలనీవాసుల ఫిర్యాదు మేరకు ఆయన శుక్రవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జీహెచ్‌ఎంసీ డీసీ ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో ఆయన ఘటనా స్థలానికి విచ్చేసి సమస్యను పరిశీలించారు. దీనిపై స్పందించిన డీసీ సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి, రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్కా ప్రకాష్, అభిషేక్ గౌడ్, దయా గౌడ్, నవీన్ రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



సర్ దరఖాస్తు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

**తార్నాక, జులై 17 ప్రభాతవార్త :** ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని క్యాంప్ నెం.6, మాణికేశ్వరి నగర్, తార్నాక, నాగార్జున కాలనీలో జరుగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ శాసనసభ్యులు పద్మారావు గౌడ్ శుక్రవారం క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన కార్యక్రమం నిర్వహణ తీరును పరిశీలించడంతో పాటు నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ బీఆర్ఎస్ నాయకులు, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి జింకల మల్లేష్, నాయకులు భోపాల్, గుండెల్లి మధుకర్, ఖాజా పాషా, యాకూబ్ షరీఫ్, గుడా అరుణ్ కుమార్, ఇషాక్, జకీర్, ముజాహిద్, సాబేర్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



వైటీడిపి సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్‌ను చింతలకుంటలోని ఆమె నివాసంలో కలిసి పరామర్శించిన ప్రభుత్వ సలహాదారులు విహెచ్ హన్మంత్ రావు

## ఎల్బీనగర్‌లో వేగవంతంగా సర్ సర్వే కార్యక్రమం : జోనల్ కమిషనర్ వికాస్ మహతో



వివరాలను తెలియజేస్తున్న ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో

**ఎల్‌బినగర్ ప్రతినిధి, జూలై 17, ప్రభాతవార్త:** ఎల్బీనగర్‌లో సర్ సర్వే ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుందని, బూత్ లెవెల్ అధికారులు ఇచ్చిన ఎన్యుమ రేషన్ ఫారలను వెంటనే పూర్తి చేసి అందజేయాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో తెలిపారు. శుక్రవారం అయిన జోనల్ కార్యాలయంలో మాట్లాడుతూ ఎల్బీనగర్ లో 6లక్షల 8వెల ఓటర్లు ఉండగా ఇప్పటివరకు ఒక లక్ష ,62 వెల 950 మంది ఓటర్లు డ్రాఫ్ట్ లిస్టులో నమోదయినట్లు ఆయన పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం సర్ సర్వే 26.79 శాతం పూర్తయిందని వివరించారు. 2002లో ఓట్లు వేసిన వారందరూ బిఎల్ఓ ల వద్ద తీసుకున్న ఎన్యుమరేషన్ ఫారాలు పూర్తి చేసి వెంటనే అందజేయాలని విజ్ఞప్తి చేసారు. గతంలో ఓటు వేసిన వారు ప్రస్తుతం ఓటర్ లిస్ట్ లో పేర్లు లేని వారు గత ఓటర్ లిస్టులో ఉన్న ఎపిక్ కార్డు నెంబర్ ను జోడించి బూత్ లెవెల్ అధికారులకు అందజేయాలని కోరారు. సర్ సర్వే కార్యక్రమాన్ని ఆగస్టు నెల 3వ తేదీ వరకు పొడిగించారని, అప్పటివరకు నియోజకవర్గంలో బిఎల్ఓల వద్ద తీసుకున్న ఫారాలను పూర్తి చేసి వారికి అందజేయాలని తెలిపారు. ఒకవేళ తీసుకోకపోతే వెంటనే అధికారులను సంప్రదించి ఫారాలను తీసుకుని పూర్తి చేసిన తర్వాత వారికి అందజేయాలని వివరించారు. రాష్ట్రంలో రెండు చోట్ల ఓట్లు ఉన్నవారు ఏదో ఒకచోట మాత్రమే తమ ఓటు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.యువ ఓటర్ల నమోదు కార్యక్రమం నిరంతరం సాగుతుందని, అలాంటివారు ఫారం6 నింపి బూత్ లెవెల్ అధికారులకు అందజేసినట్లయితే వారిని కొత్తగా ఓటర్లుగా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో చాలా మందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని తాము గుర్తించామని, అందుకే ఇక్కడ నమోదు ప్రక్రియ నెమ్మదిగా సాగుతుందని తెలిపారు. రెండు చోట్ల ఓట్లు ఉండటం వలన చాలామంది తమ సొంత గ్రామాల్లోనే ఓట్లు వేసేందుకు మొగ్గు చూపుతున్నారని, అందుకే ఇక్కడ నమోదు శాతం తక్కువగా ఉందని ఆయన తెలియజేశారు.

## ఆర్మీ అధికారులతో ఎమ్మెల్యే భేటీ..మల్కాజ్‌గిరి సమస్యలపై వినతులు



**నేరేడ్ మెట్ , జూలై 17 (ప్రభాతవార్త):** మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలంగాణ-ఆంధ్ర సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జీఓసీ) శ్రీనివాస్ వీఎస్ఎంను బొల్లారంలోని సబ్ ఏరియా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రాలు సమర్పించారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించారు.మచ్చబొల్లారం ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు డైరీ ఫామ్ రోడ్డులోని ఆర్మీ భూమిలో ఒక ఎకరం స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అలాగే ఏఓసీ అదనపు రోడ్ల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తైన నేపథ్యంలో పనులు ప్రారంభించేందుకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కోరారు.కౌకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాల, ఆర్మీ భూముల సరిహద్దు వివాదానికి శాశ్వత పరిష్కారం చూపాలని, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యాప్రాల్‌లోని దాదాపు రెండు శతాబ్దాల చరిత్ర కలిగిన సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ చర్చి, 66 సంవత్సరాల చరిత్ర గల వలేరియన్ గ్రామర్ స్కూల్ ప్రాంతంలో ఆర్మీ రహదారిపై బస్సులతో పాటు ప్రజా రవాణా సాఫీగా సాగేందుకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని కోరారు. కౌకూర్‌లోని శ్రీ సాయి రక్ష అవెన్యూ సమీపంలో ఆర్మీ శిక్షణ సందర్భంగా సంభవిస్తున్న పేలుళ్ల కారణంగా ఎగిరివస్తున్న లోహపు తునకలు, తీవ్ర శబ్దాలతో ఇళ్ల గోడలు, కిటికీలు దెబ్బతింటున్నాయని, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించి, సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కౌకూర్ దర్గా నుంచి సింగాయిపల్లి వైపు వెళ్లే మార్గానికి అవసరమైన అనుమతులు మంజూరు చేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని కోరారు.వినతులపై జీఓసీ శ్రీనివాస్ వీఎస్ఎం సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ భేటీతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జీకే హనుమంతరావు, లక్ష్మణ్ యాదవ్, రాజు యాదవ్, శ్రీనివాస్, నర్సింగ్ రావు, చక్రపాణి రెడ్డి, ఫాదర్ వినయ్ రెడ్డి, భరత్, సంబంధిత కాలనీల ప్రతినిధులు, పాల్గొన్నారు.

## ఆరోగ్య సేవల్లో నాణ్యతకు ప్రాధాన్యం : జిల్లా వైద్యాధికారి



**నేరేడ్ మెట్ జూలై 17,ప్రభాతవార్త :** ప్రభుత్వ వైద్య సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించడంతో పాటు రికార్డుల నిర్వహణ, ఔషధ నిల్వల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. కె. ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సఫిల్‌గూడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన అక్కడ అందుతున్న వైద్య సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు.ముందుగా బాహ్య రోగుల నమోదు పుస్తకం, ప్రయోగశాల రిజిస్టర్లను తనిఖీ చేసిన డా. ఆనంద్, నమోదులు నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఔషధ విభాగాన్ని పరిశీలించి మందుల నిల్వలు, అత్యవసర నిల్వల పరిస్థితిని సమీక్షించారు. గడువు సమీపిస్తున్న ఔషధాలను ముందుగానే గుర్తించి వాటి వినియోగం, నిర్వహణలో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాతా-శిశు ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయాలని, గర్భిణుల నమోదు, ప్రసవానంతర వైద్య సేవలు, శిశువులకు టీకాల కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి అర్హ లబ్ధిదారునికి సకాలంలో సేవలు అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని పేర్కొన్నారు.క్షయవ్యాధి నిర్మూలనలో భాగంగా అనుమానిత కేసులను వేగంగా గుర్తించడం, చికిత్స పొందుతున్న రోగులను నిరంతరం పర్యవేక్షించడం, వారికి అందాల్సిన ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ప్రయోజనాలు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షయవ్యాధి నిర్మూలన లక్ష్య సాధనలో ప్రతి ఆరోగ్య కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ఈ తనిఖీలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధి కారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్-నాదర్‌గుల్ రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులను పూర్తి చేయించండి



కెఎల్‌ఆర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీనియర్ నేతలు కందాడి శ్రీరాంరెడ్డి, పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూలై 17 ప్రభాతవార్త:** అసంపూర్తి నిర్మాణం కారణంగా వాహనదారులకు, స్థానిక ప్రజలకు ప్రమాదకరంగా.. ఇబ్బందికరంగా మారిన బడంగ్‌పేట్-నాదర్‌గుల్ ఆర్అండ్‌బి రోడ్డు అభివృద్ధి విస్తరణ పనులను పూర్తి చేయించాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కోరారు. నాదర్‌గుల్, బడంగ్‌పేట్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుక్కుగూడలోని పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యాలయంలో కెఎల్‌ఆర్‌ను కలిసారు. ఈ సందర్భంగా వారు అసంపూర్తి రోడ్డు దుస్థితిని, కలుగుతున్న ఇబ్బందులను ఆయనకు కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ప్రాంతాలతో పోటీ పడుతూ అభివృద్ధి సాధిస్తున్న బడంగ్‌పేట్, నాదర్‌గుల్‌లకు సంబంధించిన ప్రధాన రహదారి గత కొంత కాలం నుండి రద్దీగా మారిందని పేర్కొన్నారు. నాదర్‌గుల్, ఆదిభట్ల, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లోని ఇంజనీరింగ్ తదితర కళాశాలలకు అదే విధంగా టాటా కంపెనీ, ఔటర్ రింగ్ రోడ్డుకు విద్యార్థులు, ఉద్యోగులు తదితరులు రాకపోకలు పెరగడంతో ఈ రోడ్డు ప్రాధాన్యత పెరిగిందని వారు తెలిపారు. అయితే రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులు ప్రారంభించిన అధికారులు అసంపూర్తిగా వదిలివేయడంతో బడంగ్‌పేట్-నాదర్‌గుల్ రహదారి ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఈ అంసపూర్తి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయించి వాహనదారులకు, స్థానిక ప్రజలకు సౌకర్యవంతం చేయాలని వారు ముక్తకంఠంతో కోరారు.

**స్పందించిన కెఎల్‌ఆర్.. పూర్తి చేయిస్తానని హామీ**

నాదర్‌గుల్, బడంగ్‌పేట్ డివిజన్ల కాంగ్రెస్ నేతల విజ్ఞప్తికి స్పందించిన కెఎల్‌ఆర్ అప్పటికప్పుడు శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ తదితర అధికారులతో ఫోన్‌లో రోడ్డు విషయమై మాట్లాడారు. అసంపూర్తి పనులను పూర్తి చేయడానికి అవసరమయ్యే నిధుల విషయమై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు తీసుకురావడానికి సిద్ధమని ఆయన తెలిపారు. కెఎల్‌ఆర్ ను కలిసిన వారిలో మాజీ ఎంపిటిసి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కందాడి శ్రీరాంరెడ్డి, పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, మర్రి శశాంక్‌రెడ్డి, బంగారి అశోక్, అంకంగారి వెంకటేశ్‌గౌడ్, యాతం కుమార్ యాదవ్, తోట వినాయక్‌రెడ్డి, తోట అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఓలు ఎవరికైనా ఎన్నికల ఫారం ఇవ్వవచ్చు : జోనల్ కమిషనర్



బిఎల్‌ఓలకు సూచనలు చేస్తున్న జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తదితరులు

**ఉప్పల్, జూలై 17 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఓటరు ఫారం తీసుకున్న ప్రజలు స్థానికంగా తిరిగే ఏ బిఎల్‌ఓకైనా పూర్తి చేసిన ఎన్నికల ఫారం అందజేయవచ్చని ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా స్పష్టం చేశారు. ప్రజలు తమ కాలనీలలో కనిపించే ఏ ఒక్క బిఎల్ఓ కైనా కూడా పూర్తి చేసిన ఫారం అందజేయవచ్చుని, వీటిని తాము తీసుకుని కంప్యూటరీకరణ చేస్తున్నామని తెలిపారు. ప్రజలు నేరుగా వచ్చి కూడా సర్కిల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ప్రతి బిఎల్ఓ ప్రతి రోజు వంద ఫారాలు తీసుకోవాలని ఆదేశించారు. పారం అందని వారు సర్కిల్ కార్యాలయంలో ఎన్నికల కేంద్రంలో తీసుకునే సదుపాయం కల్పించామని, 2002 జాబితాల పేర్ల కోసం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంక్వైరీ కేంద్రంలో తీసుకునే సదుపాయం కల్పించామని తెలిపారు. జాబితాలలో పేర్లు లేకున్నా తగు పత్రాలు జత చేసి మిగిలిన కాలమ్‌లు నింపి అందజేయాలని సూచించారు. ప్రజలు కోరితే బిఎల్ఓ అధికారి ఓటరు ఇంటి వద్దే ఫారం నింపి తీసుకోవాలని సూచించారు.కాగా ఉప్పల్ సర్కిల్‌లో ఇప్పటి వరకు ప్రతి రోజు సుమారు 10 వేల నుంచి 12 మంది ఓటర్ల పత్రాలు కంప్యూటరీకరణ చేస్తున్నారు. సుమారు లక్షన్నర వరకు ఓటర్లు నమోదు పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. విడి విడిగా బూత్‌లలో ఓటరు జాబితాలలో పేర్లు ఉన్న వారు సవరణ కార్యక్రమం ముగిసిన తర్వాత దరఖాస్తు చేసుకుంటే కుటుంబ సభ్యుల మొత్తం పేర్లు ఒకే బూత్‌లో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ స్పష్టం చేశారు. ప్రతి బిఎల్ఓ అధికారి ఉదయం వంద మందికి ఫోన్ చేసి ఫారం తీసుకోవాలని ఆదేశించారు. సకాలంలో టార్గెట్ పూర్తి చేయని వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆమె హెచ్చరించారు. రాజకీయ పార్టీల నేతలు కూడా ఓటరు పత్రాల పంపిణీలో సహకరించాలని సూచించారు.

## బిఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సుకు తరలిరావాలి : ఎమ్మెల్యే



యువ సంగ్రామ సన్నాహక సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**రామంతాపూర్, జూలై 17 ప్రభాతవార్త :** బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సుకు భారీ ఎత్తున తరలిరావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన బిఆర్ఎస్ యువ సదస్సు సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సు విజయవంతం చేయాలని కోరారు. యూత్ డిక్లరేషన్ పేరుతో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, తమ హక్కుల సాధన కోసం యువత పెద్ద సంఖ్యలో యువ సంగ్రామ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, నిరుద్యోగ యువత ఒక్కటై తమ గొంతును వినిపించే వేదికగా ఈ సభ నిలవనుందని పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, యువత, విద్యార్థులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురుపూర్ణిమ ఉత్సవ కమిటి చైర్మన్‌గా పూజారి సోమయ్య



బీజేపీ నేత పూజారి సోమయ్యను సత్కరిస్తున్న ఆలయ కమిటి నేతలు

**రామంతాపూర్, జూలై 17 ప్రభాతవార్త :** రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లోని సద్గురు సాయిబాబా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం గురుపూర్ణిమ మహోత్సవాల ఉత్సవ కమిటిని ఎన్నుకున్నారు. గురుపూర్ణిమ ఉత్సవ కమిటి చైర్మన్‌గా బిజెపి సీనియర్ నేత పూజారి సోమయ్య ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈనెల 29వ తేదీన అత్యంత వైభవంగా జరగబోయే గురుపూర్ణిమ మహోత్సవాల ఉత్సవ కమిటీ చైర్మన్‌గా బీజేపీ సీనియర్ నాయకులు పూజారి సోమయ్యను నియమించారు. ట్రస్ట్ చైర్మన్ గంజి రాజమోలి గుప్తా, అధ్యక్షులు లక్ష్మణ ప్రసాద్ శర్మ తదితరులు శుక్రవారం పూజారి సోమయ్య గారిని దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా నియమిస్తున్నట్లు వెల్లడించారు. రాబోయే గురుపూర్ణిమ వేడుకలను భక్తులందరి సహకారంతో అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు శంకరయ్య గౌడ్, వైస్ చైర్మన్ బిల్లకండి యాదయ్య, ప్రధాన కార్యదర్శి: బోనగిరి శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి దూకిడి నాగేశ్వరరావు నాయకులు లక్ష్మయ్య, పీసరి శంకర్, సోమశేఖర్ గౌడ్, వెంకన్న గౌడ్, బిల్లకంటి చిన్న యాదగిరి, మల్లేష్ గౌడ్, గడ్డం సాయికిరణ్, సుదర్శన్ రెడ్డి, అవల సుధాకర్, మల్లయ్య, గాజుల మల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చైతన్యపురిలో సర్ తీరు భేష్



మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న శశిధర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** చైతన్యపురి డివిజన్ పరిధిలో సర్ తీరు సరిగా ఉందని టీపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ అభినందించినట్లు చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.శశిధర్‌రెడ్డి తెలిపారు. చైతన్యపురి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ తీరును శశిధర్‌రెడ్డి శుక్రవారం టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లి పూర్తిగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన పనితీరు పట్ల మహేష్ కుమార్‌గౌడ్ సంతృప్తి వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలో ఇదే ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంతో పని చేయాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన శ్రీరేణుకాదేవి, విజయదుర్గాదేవి పుష్కర బ్రహ్మోత్సవాలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, జూలై 17 ప్రభాతవార్త:** శ్రీరేణుకాదేవి(ఎల్లమ్మ), శ్రీవిజయ దుర్గాదేవి సమేత అమ్మవార్ల పుష్కర బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పుష్కర బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీదేవి ఉపాసకురాలు, గురుమాత సోమ వెంకటమ్మ తెలిపారు. కొత్తపేట న్యూమారుతినగర్ రోడ్‌నెంబర్ 5లోని శ్రీరేణుక ఎల్లమ్మ, శ్రీవిజయ దుర్గాదేవి అమ్మవార్ల పుష్కర బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి రోజు గణపతిపూజ, శ్రీరమాసమేత శ్రీసత్యనారాయణస్వామి వ్రతము, ఉపాంగి రస మంత్ర మాల పారాయణాలు, శ్రీరేణుక శాడవరణ మహాపూజ, శ్రీదేవి సప్తశతి పూజ, శ్రీప్రత్యంగిరా, ఏకవీర, నవదుర్గ పూజలు వేద బ్రాహ్మణుల మంత్రం చరణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చండి ఉపాసకులు పాలెం మనోహర్‌శర్మ నేతృత్వంలో పుష్కర బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

## కాంగ్రెస్ సర్కార్ పాలనలో హిందువులు, ఆలయాలపై పెరిగిన దాడులు

మహేశ్వరం అసెంబ్లీ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్



చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద ఆటో భరత్ సందేశ వాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, జూలై 17 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నుండి హిందువులు, ఆలయాలపై దాడులు పెరుగుతున్నాయని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్ ఆరోపించారు. ఇటీవల అత్తాపూర్‌లో వనపర్తి జిల్లాకు చెందిన చంచరి భరత్‌కుమార్ అనే ఆటో డ్రైవర్‌పై అన్య మతస్తుడు మతోన్మాదంతో దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. ఈ మేరకు నియోజకవర్గంలోని పలువురు బిజెపి మాజీ కార్పొరేటర్లు, నాయకులు, మహిళామోర్చా నాయకురాళ్ళతో కలిసి చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయానికి తరలివచ్చిన ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఆటో డ్రైవర్ భరత్‌కు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ భరత్ తన ఆటో వెనుక రాసిన వ్యాఖ్యలకు సంబంధించి వాహన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం యాదవ్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్‌గా జీవనోపాధి పొందుతున్న భరత్ తన ఆటో వెనుక మతం మారడం అనేది తండ్రిని మార్చుకోవడంతో సమానం రాసుకుంటే అత్తాపూర్‌లో అన్యమతస్తుడు అడ్డుకొని పరుష పదజాలంతో దూషిస్తూ దారి చేయడం దారుణమని అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛను హరించే ఈ ఘటనపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రాయణ గుట్ట నియోజకవర్గ బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మహేందర్, రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి యెల్మేటి దేవేందర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర, రంగారెడ్డి, భాగ్యనగర్, గోల్కొండ జిల్లాల నేతలు, మీర్‌పేట్ క్లస్టర్స్ బిజెపి అధ్యక్షులు పసునూరి బిక్షపతిచారి, తులసి ముఖేష్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్లు పెండ్యాల నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డి, రాత్లావత్ నీలా రవినాయక్, పాలమూరి విజయలక్ష్మి రాజు, ఇంద్రావత్ రవినాయక్, కీసరి హరినాథ్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మేకల రవీందర్‌రెడ్డి, నాయకులు కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, మద్ది రాజశేఖర్‌రెడ్డి, రాఘవేందర్, వంటేరు నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ నాయకులు నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, ఎడ్ల శ్రీశైలం ముదిరాజ్, రామిడి వీరకర్ణారెడ్డి, అందెల అయిలయ్య యాదవ్, ఈరంకి వేణుగౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పార్క్ స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి



**వనస్థలిపురం జూలై. 17,ప్రభాతవార్త :** ఉమ్మడి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని మారుతీ నగర్ కాలనీలో కబ్జాకు గురైన పార్క్ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్న వ్యక్తుల పైన వెంటనే చర్యలు తీసుకోవాలని మరియు కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని సంరక్షించడానికి విశ్వ హిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, రంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రభారి ఆలె భాస్కర్ , రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి , ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి మరియు బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి అక్రమంగా నిర్మిస్తున్న స్థలానికి చేరుకొని, కాలనీ వాసులతో కలిసి వనస్థలిపురం పోలీస్ స్టేషన్లో అక్రమంగా నిర్మాణం చేపట్టిన వ్యక్తుల పైన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీలైనంత త్వరగా చర్యలు తీసుకోకపోతే నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీధర్ రావు, సీనియర్ నాయకులు రవీందర్ గౌడ్, యశపాల్ గౌడ్, అంజన్ కుమార్ గౌడ్, విజయ్ కుమార్, వీరాస్వామి గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్ నాథ్,వీథీది మోర్చా అధ్యక్షులు మహేష్ గౌడ్,నాయకులు రవిశంకర్, శ్రీనివాస్ రెడ్డి, రామేశ్వర్, శ్రీనివాస్ శర్మ, సంగమేశ్వర్ రావు,మహేందర్ రెడ్డి, శ్రీనివాసరావు, సిద్దేశ్వర్, అనిల్, సునీల్ రెడ్డి,రఘువీర్, రాజు, నరసింహ,మురళి,విజయ్ కుమార్, కిషోర్ కుమార్, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్, రాకేష్,సాయిరాం, మరియు కాలనీ అధ్యక్షులు దుర్గాప్రసాద్, వెంకట్ రెడ్డి, కాలనీ సభ్యులు అరుణ, దుర్గ, స్వాతి, సత్య, ఉమా, శారద, బిందు, సత్యవేణి, మాధవి, భార్గవి, యాదమ్మ, సుచిత్ర, సరిత, ప్రసన్న, అశ్విని, సునీత, శ్రీ మాల, మహేశ్వరి, రమ్య, నాగలక్ష్మి, శారద మరియు తదితరులు ఉన్నారు

## రామంతాపూర్‌లో మూసీ నాలా ఆక్రమించి నిర్మాణాలు..!



రామంతాపూర్‌లో నాలా ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

**రామంతాపూర్, జూలై 17 ప్రభాతవార్త :** రామంతాపూర్ వెంకట్ సాయి నగర్ వద్ద మూసీ నాలాను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, అక్రమ నిర్మాణాలను తక్షణమే అరికట్టాలని స్థానిక బీరప్ప ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్‌తోపాటు ఉప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తాను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బీరప్ప ఆలయ కమిటి అధ్యక్షుడు శాగ రవీందర్, ఉపాధ్యక్షుడు రావుల బీరప్ప, శాగ శ్రీనివాస్, జంగయ్య తదితరులు మాట్లాడుతూ చిన్న నీటిపారుదల శాఖ నిబంధనలను తుంగలో తొక్కి కొందరు యధేచ్ఛగా మూసీ నాలాలో మట్టి నింపి ఆక్రమణలకు పాల్పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు పట్టింపులు లేని ధోరణితో వ్యవహరిస్తున్నారని వారు పేర్కొన్నారు. గుడి పేరుతో కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి నేతలు, స్థానికులు పాల్గొన్నారు.